
సాక్షి

వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 17 । మే । 2024



దేవా.. దీవించవా..

'దేవా.. దీవించవా'.. 'మమ్మల్ని కాపాడవయ్యా..' అంటూ భక్తులు వేడుకున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. -8లో



ఐటీఐతో ఉపాధికి బాట

పదవ తరగతి తర్వాత త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు ఒక చక్కటి బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.2/28.2

వాతావరణం

జిల్లాలో గురువారం 28.2- 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీసంస్థ పరంగా సమస్యలు ఎదుర్కొంటున్న వారు, తగిన సలహాలు సూచనలు ఇవ్వదలిచిన వారు 99592 25774 నెంబరుకు ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

22న పసుపు కొమ్ముల వేలం

మైదుకూరు: మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 22వ తేదీ పసుపు కొమ్ముల వేలం నిర్వహించనున్నట్లు కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం 11.30 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనేవారు ఉదయం 9 నుంచి 10.30 గంటలలోపు రూ.100 చెల్లించి టోకెన్ తీసుకోవాలని తెలిపారు. టోకెన్ సొమ్ము వాపసు ఇవ్వమని, వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు ధరావతు చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాటను దక్కించుకున్న వారికి ధరావతు సొమ్ము వాపసు ఇవ్వమని, వేలంపాట నెగ్గని వారికి మాత్రం ధరావతు సొమ్ము తిరిగి చెల్లిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు కేంద్ర పనిదినాల్లో తమను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ నిలిపివేత

కడప వైఎస్ఆర్ సర్కిల్: డ్రైవింగ్ లైసెన్స్ సేవలను ఈనెల 18 వరకు నిలిపివేస్తున్నట్లు జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగర శివారులోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రవాణాశాఖ పోర్టల్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాలు, డేటా బేస్‌లో తలెత్తిన సమస్యలతో డ్రైవింగ్ లైసెన్సుల జారీని నిలిపి వేస్తున్నామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ సేవలు 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి తిరిగి అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గుర్తించుకోవాలని సూచించారు.


19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 19న దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య తన జీవితాన్ని పేదలకు, కష్టజీవులకు అంకితం చేశారన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథుల్లో సుందరయ్య ఒకరిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

19న లాసెట్ పై ఉచిత అవగాహన తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈ నెల 19న లాసెట్‌పై ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శివారెడ్డి, సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, లా సబ్జెక్టులను నిపుణులు బోధిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9705432038 కు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

డెంగీని అరికడదాం



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు

కడప రూరల్: ఐక్యంగా డెంగీ నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ భవనంలో డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ ఏడాది నేషనల్ డెంగీ డే సందర్భంగా సమాజ భాగస్వామ్యంతో డెంగీని అరికట్టవచ్చనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ, రిమ్స్ మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగసుధ, ఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంఓ మనోరమ, ఎస్ఓ రమేష్ రెడ్డి, వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, యూనిట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు విత్తనాలు వచ్చేశాయ్

- జిల్లాకు 5849 క్వింటాళ్ల వేరుశనగ, 5323 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు
- 50 సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు, 40 శాతం సబ్సిడీతో వేరుశనగ
- ఆర్‌బీకేలో రైతుల పేర్ల నమోదుకు గ్రీన్ సిగ్నల్
- రిక్వైర్‌మెంట్‌ను బట్టి ఆర్‌బీకేల్లో నిల్వలు



సబ్సిడీతో అందించనున్న వేరుశనక్కాయలు



గోడౌన్‌లో పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

కడప అగ్రికల్చర్: ప్రభుత్వం అన్నదాతలకు అడుగడుగున అండగా నిలుస్తోంది. వ్యవసాయానికి తోడుగా పంటల సాగుకు సాయంగా నిలుబడుతోంది. ఇక విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయం వరకు అన్నదాతకు ఆసరాగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతుల పంటల సాగుకు అవసరమైన వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను కేటాయించింది. ఇందులో వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీతో అందిస్తుంది. ఇందులో వేరుశనక్కాయలను 40 శాతం సబ్సిడీతో, పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములు, పిల్లపెసలను 50 శాతం సబ్సిడీతో ఏపీ సీడ్స్ ద్వారా రైతులకు అందించనున్నారు.

జిల్లాకు మంజూరైన సబ్సిడీ విత్తనాల వివరాలు..

ఈ ఖరీఫ్ సీజన్‌కుగాను జిల్లాకు జీలుగలు 4788 క్వింటాళ్లు, జనుములు 463 కింట్వాళ్లు, పిల్లపెసలు 80 క్వింటాళ్లు మంజూరయ్యాయి.అలాగే వేరుశనక్కాయలు 5849 క్వింటాళ్లు మంజూరు చేశారు.

రైతులు చెల్లించాల్సిన వివరాలు ఇలా...

- వేరుశనగ కే6 రకం క్వింటాల్ పూర్తి ధర రూ. 9500 కాగా ప్రభుత్వ సబ్సిడీ (40 శాతం రాయితీ) రూ. 3800లు పోనూ రైతు రూ.5700లు చెల్లించాలి.
- నారాయణాద్రి రకం క్వింటాల్ పూర్తి ధర రూ. 9700 కాగా ప్రభుత్వ సబ్సిడీ (40 శాతం సబ్సిడీ) 3880 పోనూ రైతు రూ. 5820లు చెల్లించాల్సి ఉంటుంది
- కదిరి లేపాక్షి రకం క్వింటాల్ పూర్తి ధర రూ. 8700 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ. 3480 (40 శాతం సబ్సిడీ) పోనూ రైతు రూ. 5220 చెల్లించాల్సి ఉంటుంది.

విత్తనాలు	మంజూరైనవి (క్వింటాళ్లు)	సబ్సిడీ
జీలుగలు	4780	50 శాతం
జనుములు	463	50 శాతం
పిల్లపెసలు	80	50 శాతం
వేరుశనగ	5849	40 శాతం

- ఇందులో ఒక్కో బ్యాగు 30 కేజీలతో ఒక ఎకరం నుంచి ఎకరం పైన ఉంటే ప్రతి రైతుకు 3 బ్యాగుల చొప్పున ఇవ్వనున్నారు
- జీలుగలకు సంబంధించి ఒక క్వింటాల్ పూర్తి ధర రూ. 8800 కాగా సబ్సిడీ రూ.4400 (50 శాతం సబ్సిడీ) పోనూ రైతు రూ. 4400 చెల్లించాల్సి ఉంటుంది.
- పిల్లపెసలు ఒక క్వింటాల్ ధర రూ. 13400 కాగా సబ్సిడీ రూ. 6700(50 శాతం సబ్సిడీ) పోనూ రైతు రూ. 6700 చెల్లించాల్సి ఉంటుంది
- జనుములకు సంబంధించి ఒక క్వింటాల్ పూర్తి ధర రూ.8800 కాగా సబ్సిడీ రూ.4400 (50 శాతం సబ్సిడీ) పోను రైతు రూ. 4400 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో ఒక ఎకరాకు ఒక బ్యాగు (10 కేజీలు) 2 ఎకరాలకు 2 బ్యాగులు, 3 ఎకరాలకు 3 బ్యాగులు, 4 ఎకరాలకు 4 బ్యాగులు, 5 ఎకరాలకు 5 బ్యాగులను అందచేయనున్నారు. విత్తనాలను కావాల్సిన రైతులు dkrirhi appలో పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలి



పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగకాయలు కావాల్సిన రైతులు తమ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పేర్లను నమోదు చేసుకునేందుకు వెళ్లే రైతులు ఖచ్చితంగా తమ భూమికి సంబంధించిన పాసుపుస్తకం, ఆధార్ తీసుకుని వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. విత్తనాలు తీసుకునేటప్పుడు సబ్సిడీ పోను మిగతా డబ్బులు రైతులు చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చు.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

21 నుంచి కడప రాయుడి తెప్పోత్సవం



తెప్పపై కడప రాయుడు (ఫైల్)

కడప కల్చరల్: కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవం ఈనెల 21 నుంచి 23వ తేది వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. తిరుమల-తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో ఏటా మే నెలలో ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈనెల 21 నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆలయం వద్దగల శ్రీవారి పుష్కరిణిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 21న తెప్పపై శ్రీకృష్ణుడు, గోదాదేవిలను కొలువుదీర్చి మూడు ప్రదక్షిణలు చేయిస్తామన్నారు. 22న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిలకు ఐదు ప్రదక్షిణలు చేయిస్తామని, చివరిరోజు 23న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి పుష్కరిణిలో తెప్పపై ఏడు ప్రదక్షిణలు చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

బ్రహ్మంగారిమఠం: మండలంలోని మల్లేపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పీడీ యదుభూషన్ రెడ్డి పరిశీలించారు. మల్లేపల్లె, లింగాలదిన్నెపల్లె, తోట్లపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పకుండా పనులు చేయాలని కూలీలకు తెలిపారు. ఉపాధి సిబ్బంది ఎవరైనా సరిగా స్పందించకుంటే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా, ఏపీఓ , టీసీలు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు వ్యాక్సినేషన్



అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: క్షయను నిర్మూలించేందుకు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక రాధాకృష్ణనగర్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో అడల్ట్ బీసీజీ టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో టీబీ వ్యాధి వచ్చి తగ్గిపోయిన వారు టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, చక్కెర వ్యాధి కలిగిన వారు, పొగతాగేవారు, 18 కేజీల కంటే తక్కువ బరువుగల వారు ఈ బీసీజీ టీకాను వేయించుకోవాలన్నారు. ఈ టీకా ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు లేవన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలన్నారు. అలాగే 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సుగల వారు, గర్భిణులు, పాలిచ్చు తల్లులు, హెచ్ఐవీతో ఉన్న వారు, ఇతర వ్యాధులతో బాధపడేవారు ఈ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను తీసుకోకూడదని వివరించారు. అర్హులైన వారు టీకాను వేయించుకుని క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి, డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ సుమధుర పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్



పరీక్షకు హాజరైన విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది


కడప ఎడ్యుకేషన్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీలో ప్రవేశాలకు కోసం గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు బైపీసీ విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులంతా గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులను పరీక్ష కేంద్రం సిబ్బంది విద్యార్థుల హాల్‌టికెట్, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటిల్లో నిర్వహించిన 9 పరీక్షా కేంద్రాలకుగాను ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌కు సంబంధించి 2474 మంది విద్యార్థులకుగాను 2200 మంది హాజరుకాగా 274 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పరీక్షా కేంద్రం	కేటాయించిన విద్యార్థులు	హాజరు
కేఎస్ఆర్ఎం	209	200
శ్రీనివాస	400	364
అన్నమాచార్య	220	203
కేఓఆర్ఎం	296	259
కేఎల్ఎం	200	184
ఎస్ఆర్ఐటి(ప్రొద్దుటూరు)	346	300
సీబీఐటీ (చాపాడు)	298	227
అన్నమాచార్య(రాజంపేట)	295	268
బాస్కర్ ఇంజనీరింగ్ కాలేజీ (రాయచోటి)	210	195

కోట..విశేషాల కలబోత

ఈ విశాల విశ్వంలో ప్రకృతి రమణీయతకు..అపురూపమైన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలకు నెలవుగా ఎన్నెన్నో ప్రాంతాలు..గజిబిజీ జీవితంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా వేసవి సెలవులను గడువుదామని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. టూరుకు వెళితే బాగుంటుందని భావిస్తుంటారు. దూర ప్రాంతాల్లో కాకుండా దగ్గర్లో ఉంటే అనువుగా ఉంటుందని కోరుకుంటారు. అలాంటి వారిని అన్నమయ్య జిల్లాలో కొలువుదీరిన గుర్రంకొండ కోట రారమ్మని పిలుస్తోంది. చూసొద్దాం రండి..

- అన్నమయ్య జిల్లాకు మణిహారం
- నిత్యం పర్యాటకులతో సందడిగా గుర్రంకొండకోట
- సెలవుల వేళ..చూసొద్దాం రండి



రంగినీమహల్ ముందువైపు నుంచి రెండు అంతస్థులుగా కనిపిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లాలో రాచరికానికి, నవాబులు, రాజులు, బ్రిటీషువారి పాలనకు నిలువుటద్దం గుర్రంకొండ కోట. జిల్లాకు నడిబొడ్డున ఒక మణిహారంలా.. చారిత్రాత్మక పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. 14 వ శతాబ్దం నుంచి ఈకోటను పలు వంశాలకు చెందిన రాజులు, నవాబులు పరిపాలించారు. ముఖ్యంగా కడప నవాబు పరిపాలనలో ఈ కోట పేరుగాంచింది. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి దేవాలయాలు, ఎన్నో చెరువులు ఉన్నాయి. మైసూర్ రాజు టిప్పుసుల్తాన్ బాల్యం, విద్యాభ్యాస్యం ఇక్కడే గడిచింది. చివరగా బ్రిటీషువారితో ఇక్కడ రాజరిక పాలనకు తెరపడింది. ఇలాంటి ఘనచరిత్ర కలిగిన ఈ కోటలోఎన్నో విశేషాలు, చూడదగిన ప్రదేశాలు, ఆకట్టుకొనే కట్టడాలు ఇక్కడి ప్రత్యేకం. వేసవి సెలవుల్లో ఇక్కడి విశేషాలను తిలకించడానికి మన రాష్ట్రం నుంచేకాక కర్ణాటకా నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు.

రంగినీమహల్:

గుర్రంకొంట కోటలో చూడదగిన ముఖ్య ప్రదేశం రంగినీమహల్. పురాతన రాజభవనం. ముందువైపు నుంచి రెండు అంతస్తులుగా, వెనకవైపు నుంచి మూడు అంతస్తులుగాను కనిపించడం దీని ప్రత్యేకత. ఎన్నో గదులు, ఓ గదిలో భవనం లోపలి నుంచి సొరంగ మార్గం ఉంది. శత్రురాజులు దండెత్తినప్పుడు ఈమార్గం గుండా కోటబయటకు వెళ్లేందుకు దీనిని ఉపయోగించేవారు.పురాతన మెట్లు, సమావేశపు గదులు రాజరికానికి నిలుటద్దంగా నిలుస్తాయి.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం:

గుర్రంకొండ కోటను విజయనగర రాజులు పాలించే కాలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అప్పటి పాలకులు శ్రీకృష్ణ దేవరాయులు కోటలోని కొండపైభాగంలో నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. రంగినీ మహల్‌కు దగ్గరలో కొండపైకి చేరుకొనే మార్గంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్తంభాలు శిల్పకళాసౌందర్యంతో ఆకట్టుకుంటాయి. అన్ని దేవాలయాలను తూర్పుముఖంగా నిర్మిస్తే ఈ ఆలయాన్ని పశ్చిమముఖంగా నిర్మించడం విశేషం. ఇక్కడి నుంచి చూస్తే గుర్రంకొండ పట్టణంతోపాటు పరిసర గ్రామాల పచ్చటి పొలాలు, రాయల కాలం నాటి చెరువులు కనిపిస్తాయి.

కోటముఖద్వారం: గుర్రంకొండను రాజులు పరిపాలించే కాలంలో కొండ చుట్టూ కోటగోడలను నిర్మించారు. వీటి చుట్టూ కందకాలు తవ్వారు.కందకాలను నీటితో నింపేవారు. శత్రువులు కోటగోడలు ఎక్కకుండా నీటిలో మొసళ్లను వదిలేవారు. అలాంటి కోటకు ముఖద్వారాన్ని నిర్మించారు. ఈ ద్వారం నుంచే ఎవరైనా కోటలోకి ప్రవేశించేవారు. పురాతన కట్టడంగా ఇది నిలుస్తోంది.

ఇలా వెళ్లొచ్చు

జిల్లాకేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో 38 కిలోమీటర్ల దూరంలో కడప-బెంగుళూరు జాతీయరహదారిపై ఉంది. తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో వాల్మీకీపురంలో దిగాలి. అక్కడి నుంచి గుర్రంకొండ 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇదే మార్గంలోనే తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది. తిరుపతి నుంచి నేరుగా అయితే 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది. చిత్తూరు నుంచి 125 కిలోమీటర్లదూరం ఉంటుంది. మదనపల్లె నుంచి కడపకు వెళ్లే మార్గంలో అయితే మదనపల్లె నుంచి 33 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

ఇంకా చూడదగినవి..

- కొండపైన కోట బురుజులు, పురాతన కట్టడాలు, పురాతన ఇళ్లు ఉన్నాయి. అక్కడికి చేరుకోవడానికి మెట్లమార్గం కూడా ఉంది.
- కోటలో శిథిలావస్థకు చేరుకొన్న అలనాటి ఆస్పత్రి భవనం ఉంది.
- కోటలో శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, టిప్పు సుల్తాన్ కాలంనాటి ఈద్గాలు ఉన్నాయి.
- గుర్రంకొండ పట్టణంలో శ్రీ షాకమాల్ దర్గా దర్గా దగ్గర టిప్పుసుల్తాన్ చదువుకొన్న పాఠశాల యూసూఫ్ సాహేబ్ తకియా ఉంది.
- కోట నుంచి పదికిలోమీటర్ల దూరంలో తరిగొండ గ్రామంలో ప్రముఖ రచయిత్రి తరిగొండ వెంగమాంబ ఆలయముంది.
- కోట నుంచి 8 కిలోమీటర్లదూరంలో సంతాన ప్రదాయిని చెర్లోపల్లె శ్రీ రెడ్డెమ్మకొండ దేవాలయం ఉంది.

మగ్బీరా: కోటపక్కనే మగ్బీరా ఉంది. పురాతన మహమ్మదీయుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కట్టడం ఇది. మగ్బీరా అంటే సమాధి. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ మేనమామ మీర్‌రజా అలీఖాన్ పాలించే వారు. అతను మృతిచెందిన తరువాత సమాధిని మగ్బీరాగా నిర్మించారు. ఇక్కడి డూమ్‌లో చేసే శబ్దాలు ప్రతిధ్వనించడం (రీసౌండ్) ఇక్కడి ప్రత్యేకత.

షాహజాదీమసీదు:

టిప్పు సుల్తాన్ కాలంలో రాజవంశీయుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మసీదు ఇది. పూర్తిగా రాతితోనే నిర్మించడం దీని ప్రత్యేకత. ఎక్కడా ఇతర నిర్మాణ వస్తు వులు(ఇసుక,సిమెంటు, కంకర) లాంటివి వినియోగించకుండా పూర్తిస్థాయిలో రాతితోనే నిర్మించారు. ప్రస్తుతం దీనిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు.

మద్యం 'రింగ్ మాస్టర్' రింగుల బాషా అరెస్ట్


రింగుల బాషా (ఫైల్)

కర్నూలు : మద్యం రవాణా రింగ్ మాస్టర్ చింపర్తి రింగుల బాషాను కర్నూలు సెబ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కర్నూలు శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారుల తనిఖీల్లో గత నెల 6న రూ.14.51 లక్షలు విలువ చేసే 240 బాక్సుల మద్యం పట్టుబడింది. ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న చింపర్తి రింగుల బాషా కోసం కర్నూలు సెబ్ అధికారులు ముమ్మరంగా గాలించారు. అయితే అతనిపై వైఎస్సార్ జిల్లాలో కూడా కేసులు ఉండటంతో ఆ జిల్లా పోలీసులు అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న రింగుల బాషాపై కర్నూలు జిల్లాలో అక్రమ మద్యం రవాణా కేసు ఉందని, అతనిని విచారించేందుకు అనుమతివ్వాలని కోరుతూ సెబ్ అధికారులు జేఎఫ్‌సీఎం కోర్టులో ప్రిజనర్ ట్రాన్స్‌ఫర్ (పీటీ) వారెంట్ దాఖలు చేశారు. ఆ మేరకు న్యాయస్థానం అనుమతితో రింగుల బాషాను అరెస్టు చేశారు. ఇదే కేసులో వాహన డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీలపైనా కేసు నమోదు చేసి పట్టుబడిన రోజే కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలోని శ్రీనివాస వైన్స్ పేరుతో బిల్లులు వేయించుకుని వనపర్తి ఐఎంఎల్ డిపోలో మద్యం లోడ్ చేసుకుని మైదుకూరు, ప్రొద్దుటూరుకు తరలిస్తున్న రింగుల బాషా సెబ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. రింగుల బాషాపై గతంలో ఎర్ర చందనం, మద్యం రవాణాకు సంబంధించి దాదాపు 104 కేసులు ఉన్నాయి.

ఘనంగా గ్రామోత్సవం


గ్రామోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను పుర వీధుల్లో శివనామ స్మరణల వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. దారి వెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయంలోని కాలక్షేప మండపంలో స్వర్ణకంకణ గ్రహీత యడవల్లి రమణయ్య భాగవతార్‌చే నిర్వహించిన మోహినీ భస్మాసుర, సతీతులసి, జలంధర హరికథా కాలక్షేపం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉపాధికి బాట

- టెక్నికల్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు
- పారిశ్రామిక శిక్షణ ప్రవేశాలకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు జూన్ 10 తుది గడువు
- వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 3934 సీట్లు


కడప ఐటీఐ సర్కిల్‌లోని గవర్నమెంట్ డీఎల్‌టీసీ ఐటీఐ

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పరీక్షలు పూర్తయి ఇటీవలే ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పుడు సంబంధిత విద్యార్థులంతా పది అనంతరం చేరాల్సిన కోర్సులపై దృష్టిని కేంద్రీకరించారు. ఇప్పటికే పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు పూర్తయి ఫలితాలు కూడా ప్రకటించారు. దీంతో పలువురు విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏ కోర్సులో చేరాలా అని ఆలోచనలో ఉన్నారు. అయితే అధికశాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరుతున్నారు. ఇంకా విద్యార్థులు టెక్నికల్ కోర్సులైన పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులతో ఒక చక్కటి బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

18 ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు...

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కటి మార్గంగా ఉంటుంది. విద్యుత్తు, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. అయితే ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్ తప్పని సరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పని సరిగా లభిస్తుంది. ఇదిలా ఉంటే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ, ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ కూడా ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితోపాటు స్వయం ఉపాధి సైతం ఐటీఐ కోర్సు ఎంతో దోహదం చేస్తుంది.

జిల్లాలో 32 ఐటీఐలు...

జిల్లాలో 10 ప్రభుత్వ, 22 ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కళాశాలలకు సంబంధించి కడపలో డీఎల్‌డీసీ, మైనార్టీ ఐటీఐ, బాలికల ఐటీఐలతోపాటు చక్రాయపేట, వేముల, లింగాల, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, మైలవరం, తొండూరులలో ఉన్నాయి. ఇందులో కడపలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో హాస్టల్ వసతి కూడా ఉంది. ఇందులో ఉచిత వసతిలోపాటు భోజనం సౌకర్యం కూడా ఉంది. వీటిల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి పదవ తరగతి మార్కులతోపాటు మెరిట్, రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. మిగతా 22 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి.

కోర్సుల వివరాలు ఇలా...

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఏడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన పలు కోర్సులు ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డ్రాఫ్ట్‌సమన్ సివిల్, టర్నర్, మిషినిస్టు కోర్సులు ఉన్నాయి. అలాగే ఏడాదికి సంబంధించిన కోర్సుల్లో డ్రస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సు(కోప) డీజిల్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్ కోర్సులు ఉన్నాయి. ఇందులో ఏడాదికి సంబంధించిన డ్రస్ మేకింగ్ కోర్సు కడప ప్రభుత్వ బాలికల ఐటీఐలో మాత్రమే ఉంది. ఇందులో చేరిన బాలికలకు భోజనంతోపాటు ఉచిత వసతి సౌకర్య ఉంది.

ఉన్నత చదువులకు అవకాశం...

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు బీటెక్‌లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటరల్ ఎంట్రీని పొంది ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి...



ఐటీఐలో చేరదలిచే విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సిలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థులకు మొబైల్ నంబర్‌కు పంపిస్తాం. పదవ తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి.

– ఎం. జ్ఞానకుమార్, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల జిల్లా కన్వీనర్.

పోలింగ్ సిబ్బంది అందరికీ ఒకే రెమ్యూనరేషన్ ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు అందరికి ఒకే రెమ్యూనరేషన్ ఇచ్చేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోలింగ్ తర్వాత రోజు వరకు విధులు నిర్వహించడం వలన మరుసటి రోజు భత్యం కూడా అందించాలన్నారు.

బియ్యం రవాణా అడ్డుకోవడం సరికాదు

కడప సెవెన్‌రోడ్స్ : కడప మార్కెట్‌యార్డులోని సివిల్ సప్లయ్ గోదాముల నుంచి జిల్లాలోని మండల స్థాయి స్టాక్ పాయింట్లకు బియ్యం రవాణాకు ఏఐటీయూసీ నాయకులు అడ్డంకులు సృష్టించడం సరికాదని స్టేజ్–1 కాంట్రాక్టర్లు కేవీ రమణ, శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బియ్యాన్ని తీసుకు వెళుతున్న లారీలను బుధవారం అడ్డగించారని తెలిపారు. లారీ యజమానులకు తాము సముచితమైన ధరలనే చెల్లిస్తున్నామన్నారు. లోడింగ్ ఖర్చులను తాము, అన్‌లోడింగ్ ఖర్చులను లారీ యజమానులు భరించే విధంగా ఇంతకుమునుపే అవగాహన కుదుర్చుకున్నామని తెలిపారు. ఆ మేరకు లారీ యజమానులు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేసే వారన్నారు. కాగా, ఇప్పుడు హఠాత్తుగా అన్ లోడింగ్ ఖర్చులను కూడా స్టేజ్–1 కాంట్రాక్టర్లే భరించాలని కోరడం తగదన్నారు. అధికారులకు తాము కమీషన్లు ముట్టచెబుతున్నామంటూ ఆరోపణలు చేయడంలో ఏమాత్రం నిజం లేదన్నారు.

అంబాభవానీ నగర్‌లో చోరీ

– 7 తులాల బంగారు ఆభరణాల అపహరణ

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబాభవానీ నగర్‌లో నివాసముటున్న సచివాలయ ఉద్యోగి ప్రేమ్‌కుమార్ ఇంటిలో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఈనెల 13న ప్రొద్దుటూరుకు వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి ఉన్నారు. బీరువా తలుపులు కూడా తీసి అందులోని సుమారు 7 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. ఈమేరకు సంఘటన స్థలాన్ని తాలూకా సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

– ఏపీఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య


మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య

కడప కార్పొరేషన్ : ప్రకృతి వైపరీత్యాల పట్ల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఆ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్ణీత కాల వ్యవధిలో కొత్త సర్వీసులు విడుదల చేయాలన్నారు. లేకుంటే సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వడగాలులు, వానల వల్ల విద్యుత్ లైన్లు తెగిపడే అవకాశాలు ఉంటాయని, తగు జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు అధికంగా ఉన్నాయన్నారు. వీటి వలన కోట్ల రూపాయల ఖర్చు వస్తుందన్నారు. సంస్థకు నష్టం వాటిల్లకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను అరికట్టాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ ఎస్. రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అకౌంట్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టీడీపీ అభ్యర్థిని వెంటనే అరెస్ట్ చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్. యానాదయ్య

కడప కార్పొరేషన్ : కులం పేరుతో దూషించిన రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని ఏపీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగియగానే తమకు మద్దతు తెలపలేదన్న కారణంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై, ఏజెంట్లపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. రాయచోటిలో నాయీ బ్రాహ్మణుడైన వెంకటేశ్వర్లు ఇంటిపై 72 మంది దాడి చేసి కారును, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. వాచ్‌మెన్‌ను కూడా కొట్టారన్నారు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పోలింగ్ బూత్‌లోనే వెంకటేశ్వర్లును నానా బూతులు తిట్టాడని, ఆయన ఆధ్వర్యంలోనే వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ టీడీపీకి తొత్తుగా మారిందని, గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని ఇలాంటి దాడులను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మల్లికార్జున, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఆర్‌వీ రమణ, కేవీ రమణ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంటిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

రాయచోటి టౌన్ : రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో రాయచోటి – గాలివీడు రోడ్డులో ఉన్న వండాడి వెంకటేశ్వర్లు బంగ్లాలోకి రాయచోటి ప్రాంతానికి చెందిన పదిలం ప్రసాద్, మండ్ల సతీష్, శివశంకర్, పదిలం నిఖేష్, పాలగిరి మౌలా, యాదగిరి బాలాజీలు ఇంటి ప్రహరీకి ఉన్న సోలార్ వైర్లు కట్ చేసి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంటి లోపల పార్కింగ్‌చేసిన జీపు అద్దాలు పగులకొట్టారు. అలాగే ఫర్నీచర్, కుర్చీలు, లైట్లు, అద్దాలు ధ్వంసం చేశారు. ఈనెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ తరఫున జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకొందని తెలిపారు. దీన్ని మనసులో ఉంచుకుని పోలింగ్ ముగిసిన తరువాత 15వ తేదీ రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈ దాడికి పాల్పడినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు వివరించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో డీఏవీ భారతి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న వికాట్ గ్రూప్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్, తదితరులు

కమలాపురం : ఇటీవల విడుదలైన సీబీఎస్‌ఈ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో నల్లింగాయపల్లె లోని డీఏవీ భారతి విద్యార్థులు 78 శాతం సీజీపీఏతో జిల్లాలో తమ ప్రతిభ చాటారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వికాట్ గ్రూప్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జియాన్ ఫ్రాన్కో టంటర్డినీ, భారతీ సిమెంట్స్ పరిశ్రమ సీఈవో సక్సేనా మాట్లాడుతూ డీఏవీ భారతీ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక పరీక్షల్లో పాల్గొన్న 22 మంది విద్యార్థుల్లో 18 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం వారు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కె.హేమ (91 శాతం), టి.మనో కౌశిక్ రెడ్డి (90 శాతం) , కె.సాయి అభిలాష్ రెడ్డి (89 శాతం) లను బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీ సిమెంట్స్ సీఎంఓ ఎమ్.సాయి రమేష్ , చీఫ్ మేనేజర్ గోపాల్ రెడ్డి, భారతీ వికాట్ ప్రతినిధులు ప్రిన్సిపల్‌తో బాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఏవీ ప్రాంతీయ అధికారి వీఎస్ఎన్‌కే శేషాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటిలో మునిగి యువకుడి దుర్మరణం


మోహన్ సాయి మృతదేహం

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద గురువారం మోహన్ సాయి (21) అనే యువకుడు నీటిలో మునిగి దుర్మరణం చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌కు చెందిన కళ్యాణ్ కుమారుడు మోహన్ సాయి కడపలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఇతను స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వచ్చాడు. నీటిలోకి దిగి ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తూ మునిగి పోయాడు. అతనితోపాటు ఉన్న స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ టీమ్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

22 నుంచి ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్

నందలూరు(రాజంపేట) : ఈనెల 22వ తేదీ నుంచి నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లి ప్లే గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ముమ్మడిశెట్టి సుధాకర్, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, శివకోటి తెలిపారు. ఆసక్తిగల టీమ్‌లు రూ. 1500 ఎంట్రీ ఫీజు చెల్లించి మే 20వ తేదీలోపు జట్టు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ. 40 వేలు ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000527227, 9676334033, 8309199305, 9866015602 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

సుబ్రహ్మణ్య స్వామి గుడిలో చోరీ


సుబ్రహ్మణ్య స్వామి గుడిలో మూల విరాట్టు

కడప అర్బన్ : కడప నగరంలోని మహావీర్ సర్కిల్‌లో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి గుడిలో తెల్లవారుజామున రెండు గంటల సమయంలో చోరీ జరిగింది. ఈ సంఘటనలో స్వామికి సంబంధించిన వెండి కిరీటం, కొంతనగదు తీసుకెళ్లడంతో పాటు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దొంగతనం విషయాన్ని తెలుసుకున్న ఆలయ అర్చకులు సందీప్ శర్మ వెంటనే అర్చక సమాఖ్య అధ్యక్షుడు విజయ్ స్వామి, అర్చక సభ్యులు ప్రభాకర్ స్వామి, కొప్పర్తి స్వామి, సుధీర్ స్వామి, కిరణ్ స్వామితో పాటు ధార్మికవేత్తలు సట్టి భారవి, మల్లెల రామాంజనేయులుకు తెలిపారు. వారు ఆలయం వద్దకు చేరుకుని కడప మున్సిపల్ కమిషనర్‌కు విషయం తెలిపారు. ఆయన స్పందించి దేవాలయ భద్రతకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దేవా.. దీవించవా..

- ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు


నరనంది వాహనంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవారు


స్వస్తి పారాయణం చేస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం : 'దేవా.. దీవించవా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని కాపాడవయ్యా..' అంటూ భక్తులు వేడుకున్నారు. బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజైన గురువారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలతో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

వైభవంగా నరనంది ఉత్సవం

రాత్రి నరనంది ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నరనంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి వీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతి వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబ దత్తాత్రేయస్వామి, వరదరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.